క్లుప్తంగా

నేడు పంచాంగ శ్రవణం

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకుని వేదపండితులు మేళ్లూరి వేంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పగుడాల శ్రీశైలానికి సన్మానం



శ్రీశైలంను సన్మానిస్తున్న న్యాయవాదులు

యాచారం: బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమితులైన యాచారం మండలం తక్కళ్లపల్లికి చెందిన పగుడాల శ్రీశైలంను సోమవారం రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. జిల్లా కోర్టు హాల్‌లో సోమవారం న్యాయవాదుల బృందం శ్రీశైలంను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, న్యాయవాదులు రాజేందర్‌రెడ్డి, అశోక్, రాధాకృష్ణ, మీనాక్షి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్నేహలతారెడ్డి

ఆమనగల్లు: పట్టణంలోని ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్ ఆవరణలో సోమవారం జేజే హోలిస్టిక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ స్నేహలతారెడ్డి విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత పరీక్షలు నిర్వహించి దంత సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు అందించారు. దంతాలు, దంత సంరక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగదాంబ పిరమిడ్ వ్యవస్థాపకురాలు జ్యోతిరెడ్డి, డా.భాస్కర్, ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్ యాజమాన్యం బికుమాండ్ల ప్రదీప్, శివలింగం, కోట్ల వెంకటేశ్, సంజీవ్‌కుమార్, శైలజ, శశికిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు



శిబిరంలో పాల్గొన్న కార్మికులతో వైద్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: లేబర్ కార్డు కలిగి ఉన్నవారికి సోమవారం ఇబ్రహీంపట్నంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, లివర్, థైరాయిడ్, రక్త, మూత్ర తదితర 20 పరీక్షల వరకు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సాయికిరణ్, రాజశ్రీ,, మున్సిపల్ సీఐటీయూ కార్యదర్శి ఎల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

ఎస్ఐ శ్రీకాంత్



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

తలకొండపల్లి: సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. లోన్, లాటరీ పేరుతో వచ్చే మెసేజ్‌లు, ప్రకటనల పట్ల ఆశపడి మోసపోవద్దని సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఈ విషయమై పోలీసులుఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... సైబర్ మోసానికి గురైతే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలన్నారు. ఫోన్ నంబర్లు బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం కావడంతో కేటుగాళ్లు యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోమని చెప్పి ఖాతాల్లో ఉన్న సొమ్మును ఖాళీ చేస్తున్నారన్నారు. ఇన్వెస్ట్‌మెంట్, బెట్టింగ్ ఫ్రాడ్, లాటరీ, లోన్ ఆఫర్ల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీలు, ఏటీఎం పాస్‌వర్డులు అడిగితే ఇవ్వవద్దన్నారు. బ్యాంకులు ఫోన్లు చేసి ఓటీపీలు అడగవన్నారు. పోలీస్ సిబ్బంది, బ్యాంకు ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు.

అత్యవసర సేవలా.. అంతే సంగతులు

- మాడ్గుల మండలంలో 108 అంబులెన్స్ లేక అవస్థలు
- యాక్సిడెంట్లు, అత్యవసర సమయాల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి
- ప్రాణాలు కోల్పోతున్న క్షతగాత్రులు, రోగులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



మాడ్గుల ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి

మాడ్గుల: మండలంలో 108 అంబులెన్స్ సర్వీసు లేకపోవడంతో రోగులకు సకాలంలో వైద్యసేవలు అందడంలేదు. 33 గ్రామ పంచాయతీలు కలిగిఉండి సుమారు 50వేల జనాభా ఉన్న మాడ్గుల మండలంలో ప్రభుత్వ అంబులెన్స్ సర్వీస్ లేకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో యాక్సిడెంట్లు, ప్రెగ్నెన్సీ, పాముకాట్లు వంటి ప్రమాదాలు జరిగితే అంబులెన్స్ సర్వీసు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో తీసుకురావడంతో మెజార్టీ రోగులు, క్షతగాత్రులు మార్గ మాధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారు.

వైద్య సేవలు అందుబాటులో ఉన్నా..

మాడ్గుల మండల పీహెచ్‌సీ 24 గంటల పాటు అందుబాటులో ఉండటంతో పాటు, ఇర్విన్ గ్రామంలోని ప్రాథమిక ఆస్పత్రి 12 గంటల పాటు సేవలు అందిస్తోంది. ఆయా పీహెచ్‌లకు తరలించాలంటే ప్రభుత్వం తరఫున ఒక్క అంబులెన్స్ కూడా లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో 108 అంబులెన్స్ లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యరంగంలో దేశం, రాష్ట్రం కొత్త పుంతలు తొక్కుతున్నప్పటికీ మండలంలో కనీసం అంబులెన్స్ సౌకర్యం కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుకోని ప్రమాదం జరిగితే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించినా ప్రాణాలు నిలుస్తాయని భరోసా లేదు. 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ అంబులెన్స్ ఉన్నప్పటికీ..

అయితే మాడ్గుల మండలానికి చెందిన దాత రాంరెడ్డి మూడేళ్ల క్రితం ఓ ప్రైవేట్ అంబులెన్స్‌ను మాడ్గుల పీహెచ్‌సీకి అందించారు. అయితే సిబ్బంది, నిర్వహణ లేకపోవడంతో ఆ అంబులెన్స్ పీహెచ్‌సీలోనే శిథిలావస్థలో నిరుపయోగంగా ఉంది. కనీసం దానికి మరమ్మతులు కూడా చేయించడం లేదు. నూతన అంబులెన్స్‌ను కేటాయించడంతో పాటు వైద్య సిబ్బందిని నియమించి నిత్యం పీహెచ్‌సీలో అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

అంబులెన్స్ కేటాయించాలి



50వేలకు పైగా జనాభా ఉన్న మండలానికి ప్రభుత్వ అంబులెన్స్ కేటాయించకపోవడం దురదృష్టకరం. చాలామంది అత్యవసర సమయంలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సమయానికి అవికూడా అందుబాటులో లేకుంటే రోగుల ప్రాణాలకు రక్షణేది. వెంటనే పీహెచ్‌సీలో 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలి.

– మహేశ్, కోల్కులపల్లి, మాడ్గుల

ప్రతిపాదనలు పంపాం



మాడ్గుల పీహెచ్‌సీకి అంబులెన్స్ కేటాయించాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే నూతన అంబులెన్స్ ఏర్పాటు చేసి రోగుల ఇబ్బందులను తీరుస్తాం.

– పద్మారెడ్డి, ఎంపీపీ, మాడ్గుల

ముగిసిన జేపీఎల్ క్రికెట్ పోటీలు

విజేతగా నిలిచిన సూపర్ స్ట్రైకర్స్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

మంచాల: మండల పరిధిలోని జాపాలలో మూడు నెలలుగా కొనసాగిన జాపాల ప్రీమియర్ లీగ్(జేపీఎల్) సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. గ్రామంలోని యువకులు 10 జట్లుగా ఏర్పడి ఈ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన సూపర్ స్ట్రైకర్స్‌కు రూ.25వేలు, ట్రోఫిని అందించారు. ఓరిగంటి భాస్కర్ గౌడ్ స్పాన్సర్ చేశారు. ద్వితీయ బహుమతి సూపర్ కింగ్స్ జట్టుకు రూ.15వేలు, ట్రోఫీని అందజేశారు. భాస్కర్ యాదవ్ స్పాన్సర్ చేశారు. అదే విధంగా క్రీడల నిర్వహణకు.. రమేష్, మల్లప్ప, సతీష్, కృష్ణ, భాస్కర్, సింగారం నర్సింహ, సుందరయ్య, నాగచారి, నర్సింహ, బాలరాజ్, సంజీవ ఆర్థిక సహకారం అందించారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా అశ్వాక్, బెస్ట్ బౌలర్‌గా ఆనంద్, బెస్ట్ ఫీల్డర్‌గా శ్రీకాంత్ గౌడ్‌కు బహుమతులు అందజేశారు. ఆర్గనైజర్లు మహేష్‌గౌడ్, చంద్రకాంత్, నర్సింహ, సత్యం, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై తక్కళ్లపల్లి గేట్ వద్ద లీకేజీ అవుతున్న కృష్ణాజలాల పైప్‌లకు సోమవారం మెట్రోవాటర్ వర్క్స్ ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. నాలుగు రోజుల కింద 'సాక్షి' దినపత్రికలో 'కృష్ణాజలం...వృథాపర్వం' అనే కథనానికి స్పందించిన అధికారులు లీకేజీ అవుతున్న ప్రాంతంలో మరమ్మతులు చేపట్టారు. ఈ పైపుల నుంచేసాగర్ నుంచి కృష్ణాజలాలు నగరానికి సరఫరా అవుతున్నాయి. సమస్య పరిష్కరించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్..



పైపుల మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అనురాధ, సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్: పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా పారిశుద్ధ్య కార్మికులు పనిచేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ సూచించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డితో కలిసి ఆమె పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్నామని.. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పొదలను తొలగించడం, గుంతలను పూడ్చటం, రోడ్లను శుభ్రం చేయడం, ఫాగింగ్, దోమ లార్వాలను నియంత్రించే రసాయనాలను పిచికారీ చేయడం వంటివి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో చేర్చి చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, నాగేష్, ఈఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు విడుదల చేయండి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డికి వ్యవసాయ కార్మిక సంఘం నేతల వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

యాచారం: ఉపాధి పనులు చేసిన కూలీలకు సకాలంలో పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేసింది. సోమవారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డిని కలిసి వారు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. పనులు చేసి రెండు, మూడు వారాలు గడిచినా వారికి బిల్లులు రావడం లేదని.. దీంతో కూలీలు పస్తులుండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పే స్లిప్పులు క్రమం తప్పకుండా అందజేయాలని, వేసవి తీవ్రత దృష్ట్యా ఉదయం పూటనే ఉపాధి పనులు చేయించాలని, ఏడాదికి 200 పనిదినాలు కల్పించి, నిత్యం కూలీ రూ.600 అందజేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు పనిముట్లు ఇవ్వడం తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, పుష్ప, రాములు, ఇందిరమ్మ, జంగయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జైపాల్‌యాదవ్, నాయకులు

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తండ్రి గూడూరు నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త.. కడ్తాల్‌కు వెళ్లి శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించారు. నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఉపాధ్యాయులు గూడూరు రవీందర్‌రెడ్డి, నాయకులు వీరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తుమ్మలూరుకు బస్సు సౌకర్యం కల్పించండి

డిపో మేనేజర్‌కు గ్రామస్తుల వినతి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

మహేశ్వరం: తుమ్మలూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సోమవారం గ్రామయువకులు, విద్యార్థులు మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తుమ్మలూరుకు గతంలో ఆర్టీసీ బస్సు నడిపేవారని కోవిడ్ వచ్చినప్పటి నుంచి బస్సులను నిలిపివేశారు. బస్సులు నిలిపివేయడంతో నిత్యం రైతులు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎండలో నిత్యం తుమ్మలూరు నుంచి తుమ్మలూరు గేటు వరకు నడుచుకుంటూ వెళ్తున్నారని, వెంటనే గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును నడిపించాలని డిపో మేనేజర్‌ను కోరారు. త్వరలో డిపో నుంచి ఫీల్డ్ ఆఫీసర్‌ను గ్రామానికి పంపించి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుమ్మలూరు గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కండి

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ప్రజలకు అంబలి పంపిణీ చేతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా సహకారంతో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సందర్శించారు. నిర్వాహకులతో కలిసి ప్రయాణికులకు రాగి అంబలిని అందించారు. లయన్స్ క్లబ్‌తో పాటు, స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, లయన్స్ క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, ఏఎస్ఐ సీతారాంరెడ్డి, భరత్‌యాదవ్, కుమార్‌గౌడ్, శ్రీను, పాండునాయక్ తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్‌లు మత సామరస్యానికి ప్రతీకలు..

కడ్తాల్: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్‌కుమార్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో జైపాల్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రజాప్రతినిధులు, సోదరులకు రంజాన్ పండుగ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన వైస్ ఎంపీపీ ఆనంద్‌కుమార్‌కు మజీద్ కమిటీ ఆధ్వర్యంలో మెమెంటోను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మజీద్ కమిటీ అధ్యక్షులు రవూఫ్, అహ్మద్ జానీ, ఉపాధ్యక్షుడు జావీద్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు జహంగీర్ అలీ, వీరయ్య, ఇర్షాద్, గంప శ్రీను, రాజేందర్‌యాదవ్, సైదులు, అజ్గర్‌అలీ, గౌస్, నర్సింహ, ఇమామ్ జహీరుద్దీన్ ఉన్నారు.

నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ వసంత



ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ వసంత తెలిపారు. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత వేసవికాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో నీటి సమస్య రాకుండా అన్నిరకాల చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే ప్రజలు తాగునీటిని వృథా చేయరాదని సూచించారు. ఎవరైనా తాగునీటిని వృథా చేసినట్లు గుర్తిస్తే వారిపై మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి సమస్యలపై 94408 48425 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో ఆస్తిపన్నును ఈనెల 30లోపు చెల్లించి 5శాతం రాయితీని పొందాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఈ నెలాఖరులోపు చెల్లించాలని కమిషనర్ కోరారు.

మైసిగండిలో ప్రత్యేక పూజలు

కడ్తాల్: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్ అన్నారు. సోమవారం కడ్తాల మండలం మైసిగండిలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిపించి రాష్ట్రం సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని వేడుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఎంపీపీ కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కర్నె శ్రీశైలానికి ఘన నివాళి



శ్రీశైలం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నె శ్రీశైలం వర్ధంతిని ఆమనగల్లు పట్టణంలో సోమవారం నిర్వహించారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద కర్నె శ్రీశైలం చిత్రపటానికి ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కర్నె శ్రీశైలం ఆశయసాధనకు కృషి చేస్తామని అన్నారు. శ్రీశైలం ఎస్సీల హక్కులను కాపాడేందుకు అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణ, నాయకులు పవన్, మల్లేశ్, రాజు, దేవేందర్, నర్సింహ, యాదయ్య, మహేశ్, రామలింగం, మురళి, సాయి, ఏబీవీపీ నాయకులు మల్లేశ్, వెంకటేశ్, విజయ్, తరుణ్ తదితరులు ఉన్నారు.

పక్కాగా 'ఆరు గ్యారంటీల' అమలు

పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు మధుయాష్కీ

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ ఇచ్చిందంటే పక్కా అమలు చేస్తుందని టీపీసీసీ ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డితో కలిసి సోమవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్, వనస్థలిపురం డివిజన్ల పరిధిలో ఆయన మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో ముచ్చటించి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను విస్మరించిందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ ప్రకటించిన 'ఐదు న్యాయ' గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. పట్నం సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో సమస్యలు తనకు తెలుసునని, తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు నాగోల్ జిల్లా పరిషత్ పాఠశాల, ఇతర మౌళిక సదుపాయాలకు నిధులు ఇచ్చానన్నారు. తనను గెలిపిస్తే ప్రత్యేక నిధులు తీసుకొచ్చి ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం డివిజన్ల అధ్యక్షులు మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహాయాదవ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, సామ రమణారెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్, శాలిని, రామారావు, వేణు, శ్రీనివాస్‌గౌడ్, వేముల య్యగౌడ్, స్వర్ణమాధవి, ఉమేష్‌గౌడ్, రవీందర్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడం అభినందనీయం

జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ కాశీవైద్యనాథ దేవాలయంలో గోల్డెన్ వాకర్స్‌టీం ఆర్యవైశ్య గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆలయాన్ని పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడంతో నిత్యాన్నదానం చేయడం అభినందనీయమని దేవాలయ ఫౌండర్ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌లను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, భార్గవ్‌రాజ్‌గౌడ్, అరుణ, రోజా, గోల్డెన్ వాకర్స్‌టీం సభ్యులు నగేష్‌గుప్తా, ప్రభాకర్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, కే.ఎస్.గుప్తా పాల్గొన్నారు.